# త్వరలో హ్యుందాయ్ క్రెటా ఎలక్ట్రిక్




**వచ్చే జనవరి-మార్చిలో మార్కెట్‌లోకి • మరో మూడు ఈవీ మాడళ్లూ రాక**

న్యూఢిల్లీ, జూన్ 17: హ్యుందాయ్ మోటర్ ఇండియా.. విద్యుత్తు ఆధారిత వాహనాలపై (ఈవీ) దృష్టి పెట్టింది. ఇందులో భాగంగానే ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) ఆఖరు (వచ్చే ఏడాది జనవరి-మార్చి)కల్లా దేశీయ మార్కెట్‌కు 4 ఎలక్ట్రిక్ వెహికిల్ మాడళ్లను పరిచయం చేయాలనుకుంటున్నది. వీటిలో పాపులర్ క్రెటా మాడల్ కూడా ఉన్నది. ఈ మేరకు మార్కెట్ రెగ్యులేటర్ సెబీకి దాఖలు చేసిన పబ్లిక్ ఇష్యూ (ఐపీవో) పేపర్లలో హ్యుందాయ్ పేర్కొన్నది. అయితే ధర, ఎన్ని కిలోమీటర్లు ప్రయాణించగలదన్న వివరాలు తెలియరాలేదు. రూ.25,000 కోట్ల భారీ ఐపీవోతో దేశీయ స్టాక్ మార్కెట్లలోకి హ్యుందాయ్ ప్రవేశించాలనుకుంటున్న విషయం తెలిసిందే. కాగా, ప్రస్తుతం భారతీయ ఆటోమొబైల్ మార్కెట్‌లో ఈవీల సందడి ఎక్కువగా కనిపిస్తున్నది. పర్యావరణ సమస్యలు, ఇంధన ధరల నడుమ వినియోగదారులు సైతం ఈవీ కొనుగోళ్లకే మొగ్గు చూపుతున్నారు. ఇక టాటా మోటర్స్ మిగతా అన్నింటికంటే ఎక్కువ మాడళ్లతో మార్కెట్‌లో దూసుకుపోతున్నది. దీంతో ఈ పోటీలో ముందు నిలిచేందుకు హ్యుందాయ్ కూడా క్రెటాసహా మరికొన్ని ఈవీ మాడళ్లను తేవాలని నిర్ణయించుకున్నది. ఈ క్రమంలోనే భారత్‌లో సెల్స్, బ్యాటరీ ప్యాక్స్, పవర్ ఎలక్ట్రానిక్స్ తదితర విడిభాగాల ఉత్పత్తి దిశగా అడుగులు వేస్తున్నది. ఇప్పటికే అయోనిక్5, కోనా ఎలక్ట్రిక్ కార్లను హ్యుందాయ్ దేశీయంగా విక్రయిస్తున్నది విదితమే. రూ.45 లక్షలు, రూ.24 లక్షల శ్రేణిలో వీటి ధరలున్నాయి. ఇదిలావుంటే ఈవీ చార్జింగ్ స్టేషన్ల నిర్మాణంపైనా సంస్థ ఆసక్తి చూపుతున్నది. దేశవ్యాప్తంగా కంపెనీకి 11 చార్జింగ్ స్టేషన్లున్నాయి. జాతీయ రహదారులపై అన్ని నగరాల్లో మరిన్ని తేవాలని చూస్తున్నది.

# పోటెత్తిన పసిడి దిగుమతులు

- **గత ఆర్థిక సంవత్సరం యూఏఈ నుంచి 210% పైకి**
- **స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ప్రభావం**

న్యూఢిల్లీ, జూన్ 17: గత ఆర్థిక సంవత్సరం (2023-24) యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) నుంచి భారత్‌కు బంగారం, వెండి దిగుమతులు పోటెత్తాయి. గతంతో పోల్చితే ఏకంగా 210 శాతం ఎగిసి 10.7 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. యూఏఈతో భారత్‌కున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందమే (ఎఫ్‌టీఏ) ఇందుకు కారణమని సోమవారం విడుదలైన గ్లోబల్ ట్రేడ్ రిసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) నివేదిక చెప్తున్నది. ఈ క్రమంలో యూఏఈతో ఉన్న ఎఫ్‌టీఏ నిబంధనల్ని సవరించాల్సిన అవసరం ఉన్నదని కూడా ఈ ఆర్థిక మేధో దిగ్గజం అభిప్రాయపడింది. ఇక భారత్-యూఏఈ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ) కింద ఇస్తున్న కస్టమ్స్ సుంకాల రాయితీపై పునరాలోచనలు చేసుకోకపోతే ఇబ్బందులేనని కూడా హెచ్చరించడం గమనార్హం. ప్రస్తుతం సీఈపీఏ కింద యూఏఈ నుంచి దేశంలోకి ఎంతైనా వెండి దిగుమతి చేసుకోవచ్చు. సాధారణంగా వర్తించే కస్టమ్స్ సుంకం కూడా 7 శాతం తక్కువే. దీని వల్ల గత ఆర్థిక సంవత్సరం ఖజానాకు రూ.1,010 కోట్ల ఆదా యం దూరమైందని జీటీఆర్ఐ తెలిపింది. 160 టన్నుల పుత్తడి దిగుమతిపై సుంకాల్లో 1 శాతం రాయితీ వస్తున్నది. 2022 ఫిబ్రవరిలో సీఈపీఏపై ఇరు దేశాల సంతకాలు జరిగాయి. అదే ఏడాది మే నెల నుంచి ఒప్పందం అమల్లోకి వచ్చింది.



## గిఫ్ట్ సిటీ సెగ

గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలోగల ఇండియా ఇంటర్నేషనల్ బులియన్ ఎక్స్చేంజ్ (ఐఐబీఎక్స్) ద్వారా కూడా యూఏఈ నుంచి పసిడి, వెండి దిగుమతులు చేసుకొనేలా ప్రైవేట్ సంస్థలకు మోదీ సర్కారు అవకాశం ఇచ్చింది. అంతకుముందు ఆథరైజ్డ్ ఏజెన్సీలకే ఈ వీలుండేది. ఫలితంగా దేశ వాణిజ్య లోటు పెరిగిపోతున్నది. దీంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సొంత రాష్ట్రంలోని గిఫ్ట్ సిటీ ఉన్నతికి తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయిప్పుడు.

**స్మగ్లింగ్‌కు చెక్ పెట్టాలి**

అధిక దిగుమతి సుంకాలతో దేశంలోకి బంగారం, వెండి స్మగ్లింగ్ పెరుగుతున్నదని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాత్సవ అన్నారు. ప్రస్తుతం 15 శాతంగా సుంకం ఉన్నదని గుర్తుచేశారు. దీన్ని 5 శాతానికి తగ్గిస్తే స్మగ్లింగ్ పెద్ద ఎత్తున తగ్గుతుందని సూచించారు. కాగా, అంతకుముందుతో పోల్చితే గత ఆర్థిక సంవత్సరం భారత్‌లోకి యూఏఈ నుంచి జరిగిన మొత్తం దిగుమతులు 9.8 శాతం పడిపోయాయి. 2022-23లో 53.2 బిలియన్ డాలర్లుగా ఉంటే, 2023-24లో 48 బిలియన్ డాలర్లకే పరిమితమయ్యాయి. అయినప్పటికీ ఇదే సమయంలో బంగారం, వెండి దిగుమతులు 3.5 బిలియన్ డాలర్ల నుంచి 10.7 బిలియన్ డాలర్లకు పెరిగాయి. ఆభరణాల వాటా కూడా ఇందులో పెద్ద ఎత్తునే ఉన్నది.

## హైదరాబాద్‌కు జేబీపీ

ముంబై, జూన్ 17: వజ్రాల తయారీదారు జ్యువెల్స్ బై ప్రీతి (జేబీపీ) విస్తరణ బాట పట్టింది. ఇందులో భాగంగానే హైదరాబాద్‌తోపాటు ముంబై, ఢిల్లీ, బెంగళూరు, పుణె, చెన్నై, కోల్‌కతా, అహ్మదాబాద్‌ల్లో స్టోర్లను ఏర్పాటు చేయబోతున్నది. ఈ ఏడాది ఆఖరుకల్లా దేశవ్యాప్తంగా 15 స్టోర్లను తెస్తామని సోమవారం కంపెనీ వ్యవస్థాపకులు ప్రీతి జైన్ తెలిపారు.

## రిటైర్డ్ ఉద్యోగులకు ప్యాకేజీని పెంచాలి

హైదరాబాద్, జూన్ 17 (నమస్తే తెలంగాణ): అతి తక్కువ పెన్షన్‌తో రిటైర్డ్ బొగ్గు గని కార్మికులు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని, పెట్రోలియం కంపెనీల తరహాలో కోల్ ఇండియా, సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకూ ఆర్థిక ప్యాకేజీని వర్తింపజేయాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు సోమవారం సింగరేణి భవన్‌లో సింగరేణి గుర్తింపు సంఘం నాయకులతో విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై అసోసియేషన్ అధ్యక్షుడు డీ రామచందర్‌రావు వినతి పత్రాన్ని సమర్పించారు.

## తరాలు మారినా.. తరగని బంధం

### కలిసికట్టుగా రుయా సోదరులు

**దేశ, విదేశీ వ్యాపారాలను ఒక్కటై నడిపిస్తున్న ఉమ్మడి కుటుంబం**

RUIA GROUP

*తల్లిదండ్రులు-బిడ్డల మధ్య వారసత్వ తగాదాలు.. అన్నదమ్ముల నడుమ ఆస్తుల గొడవలు.. ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో ఉన్నాయి. అయితే ఈ తగువులకు దేశంలోని వ్యాపార కుటుంబాలూ అతీతం కాదు. ఇంకా చెప్పాలంటే వీళ్ల మధ్యే అధికం. అలాంటి ఘటనల్ని చూశాం.. చూస్తూనే ఉన్నాం కూడా. కానీ రుయా సోదరులు ఇందుకు మినహాయింపు. తరాలు మారినా తరగని బంధంతో కలిసికట్టుగా నడుస్తున్నారు మరి. దేశ, విదేశీ వ్యాపారాల నిర్వహణలో ఈ ఉమ్మడి కుటుంబం అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నది.*

తమ వారసులతో ఎస్సార్ గ్రూప్ వ్యవస్థాపక సోదరులు రవి రుయా, శశి రుయా

న్యూఢిల్లీ, జూన్ 17: వ్యాపారంపై పట్టు కోసం రోడ్డెక్కుతున్న వారసులను ఇటీవలి కాలంలో ఎందర్నో చూస్తున్నాం. తమ తాతలు, తండ్రుల సంపద కోసం కోర్టుల్లో ఏండ్ల తరబడి పోరాడుతున్నవారూ ఉన్నారు. అంబానీలు, హిందుజా సోదరులతోపాటు ఎస్కార్ట్స్, రేమండ్స్, అపోలో టైర్స్, కేకే మోదీ కుటుంబ గొడవలు తెలిసిందే. కానీ ఎస్సార్ రుయా కుటుంబం మాత్రం తమదైన రీతిలో ఒక్కటై విజయాలను సాధిస్తున్నది. మెటల్స్ దగ్గర్నుంచి పోర్టులదాకా వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటూపోయిన శశి రుయా, రవి రుయాలకు.. వారి కుటుంబ సభ్యులే పెద్ద బలం. అవును.. వారి పిల్లలు, వాళ్ల పిల్లలు ఇలా మూడు తరాలు తరగని బంధంతో ఒక్కటై వెళ్తున్నారు. దేశ, విదేశాల్లోని వ్యాపారాలను ఉమ్మడిగా నిర్వహిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు.

**55 ఏండ్లపైనే..**

1969లో తొలి తరం రుయాలైన శశి, రవి రుయా సోదరులు ఎస్సార్ గ్రూప్‌ను స్థాపించారు. అప్పుడే మద్రాస్ పోర్ట్ ట్రస్టు నుంచి రూ.2.5 కోట్ల విలువైన మొదటి ఆర్డర్‌ను అందుకున్నారు. అప్పట్నుంచి క్రమేణా వ్యాపారాలను విస్తరించుకుంటూ పోయారు. నిజానికి తొలినాళ్లలో నిర్మాణ, ఇంజినీరింగ్ రంగాలపైనే రుయాలు దృష్టిపెట్టారు. కానీ 1980వ దశకంలో విద్యుత్తు, చమురు, గ్యాస్ రంగాల్లోకీ వచ్చారు. ఇక 1990ల్లో ఉక్కు, టెలికం రంగంలోకీ ప్రవేశించారు. అయితే వ్యాపార విస్తరణలో భాగంగా తీసుకున్న రుణాలు.. రుయాలను అప్పుల ఊబిలోకి నెట్టాయి. నిజానికి 2012లో ప్రపంచంలోనే అత్యంత భారతీయ ధనవంతులుగా రుయా సోదరులు 7 బిలియన్ డాలర్ల సంపదతో ఫోర్బ్స్ జాబితాలో నిలిచారు. అయితే పెరిగిన రుణ భారాన్ని దించుకునే క్రమంలో టెలికం సంస్థను, ఆయిల్ రిఫైనరీ, స్టీల్ ప్లాంట్లను అమ్ముకోవాల్సి వచ్చింది. ఇలా రూ.2 లక్షల కోట్లకుపైగా రుణాలను తగ్గించుకున్నారు. ఇప్పుడు ఎస్సార్ గ్రూప్ తిరిగి ఆవిష్కృతమవుతున్నది.

**అంతా ఒక్కచోటనే..**

ముంబై, ఢిల్లీ, లండన్‌లలో రుయా సోదరుల కుటుంబాలు దాదాపు 60 ఏండ్లుగా కలిసే జీవిస్తున్నాయి. కొడుకులు, మనుమలు-మనుమరాండ్లు కుటుంబ వ్యాపారాలను ఒక్కటై చూసుకుంటున్నారు. ప్రస్తుతం ఎస్సార్ గ్రూప్.. ఎనర్జీ, మెటల్స్, మైనింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, లాజిస్టిక్స్, టెక్నాలజీ, రిటైల్ రంగాల్లో వ్యాపారాలను నిర్వహిస్తున్నది. 14 పోర్ట్‌ఫోలియో కంపెనీలున్నాయి. భారత్‌తోపాటు బ్రిటన్, వియత్నాంలలో ఆయిల్ రిఫైనరీ, పవర్ ప్లాంట్లున్నాయి. 35కుపైగా దేశాల్లో ఐటీ సొల్యూషన్స్‌ను అందిస్తున్నది. రెన్యువబుల్స్ ఎనర్జీలోకీ ప్రవేశించింది. గ్రూప్ రెవిన్యూ దాదాపు 15 బిలియన్ డాలర్లు. ఆస్తులు సుమారు 8 బిలియన్ డాలర్లపైనే.

> *కుటుంబ సభ్యులందరం కలిసే ఉంటాం. గ్రూప్‌లోని ఒక్కో వ్యాపార విభాగాన్ని ఒక్కొక్కరం చూసుకుంటాం. లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధన కోసం సమష్టిగా కృషి చేస్తాం. ఆలోచనల్ని, సంతోషాల్ని పంచుకుంటాం. సలహాల్ని ఇచ్చిపుచ్చుకుంటాం. కొత్త తరాలు వస్తున్నా.. మా ఈ బంధం బలపడుతూనే ఉండటం ఆనందంగా ఉన్నది. 12 ఏండ్ల వయస్సు నుంచే నేను సెలవు రోజుల్లో నాన్నతో కలిసి పనిచేయడం మొదలు పెట్టాను. కుటుంబంలోని పెద్దవారంతా తర్వాతి తరాలకు ఉమ్మడి కుటుంబం లాభాలను వివరిస్తూపోతున్నాం.*
>
> **-ప్రశాంత్ రుయా, శశి రుయా కుమారుడు**

# మారనున్న ఆదాయ పన్ను రేట్లు?

న్యూఢిల్లీ, జూన్ 17: వ్యక్తిగత ఆదాయ పన్ను (ఐటీ) రేట్లు మారనున్నట్టు తెలుస్తున్నది. వచ్చే నెలలో కేంద్ర ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను పూర్తిస్థాయి బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టనున్నది. మధ్యతరగతి వేతన జీవులకు ఊరటనిచ్చేలా పన్ను రేట్లలో మార్పులు చేయవచ్చన్న అంచనాలు గట్టిగా వినిపిస్తున్నాయి. మార్కెట్‌లో వినిమయ శక్తిని పెంపొందించాలన్న కోణంలోనూ దీన్ని మోదీ సర్కారు పరిశీలిస్తున్నట్టు సమాచారం. వార్షిక ఆదాయం రూ.10 లక్షల నుంచి 15 లక్షల మధ్య ఉన్నవారికి, ఆపై ఆదాయమున్న వర్గాలకు ఊరటనిచ్చేలా పన్ను రేట్లను తగ్గిస్తారన్న ఊహాగానాలున్నాయి.

# సింగరేణి ఐటీ విభాగానికి జాతీయ బహుమతి

హైదరాబాద్, జూన్ 17 (నమస్తే తెలంగాణ): ఉద్యోగుల సమాచారం, సేవలకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ)ని విస్తృతంగా వాడుతున్నందుకు సింగరేణి సంస్థ ఐటీ విభాగానికి జాతీయ అవార్డు దక్కింది. అత్యుత్తమ ఐటీ సేవలకుగాను కంప్యూటర్ ఎక్స్‌ప్రెస్ సంస్థ అందజేసే అవార్డును ఆదివారం రాత్రి రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగిన జాతీయ స్థాయి సమావేశంలో ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్ కేటగిరిలో సింగరేణికి ప్రదానం చేశారు. సోమవారం ఉదయం సింగరేణి భవన్‌లో కో-ఆర్డినేషన్ జీఎం జీ దేవేందర్, ఐటీ ప్రాజెక్ట్ మేనేజర్ హరప్రసాద్, ఐటీ డిప్యూటీ మేనేజర్లు హరిశంకర్, హరిప్రసాద్, మేనేజర్ రామ లక్ష్మయ్యలు ఈ పురస్కారాన్ని సింగరేణి సంస్థ సీఎండీ బలరాంకు అందజేశారు. అవార్డు లభించడం పట్ల ఆయన ఉద్యోగులను అభినందించారు.

# ఈవీఎంల హ్యాకింగ్‌ను నిరూపించండి

### మస్క్‌కు పురందేశ్వరి చాలెంజ్

హైదరాబాద్, జూన్ 17 (నమస్తే తెలంగాణ): ఈవీఎంల హ్యాకింగ్‌ను నిరూపించాలంటూ 'ఎక్స్' సీఈవో ఎలాన్‌మస్క్‌కు బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సవాల్ విసిరారు. ఈవీఎంలను హ్యాకింగ్ చేయవచ్చని ఆయన చెప్పారని, గతంలోనూ ఇలా చెప్పినవాళ్లు ఎలా హ్యాకింగ్ చేయవచ్చో నిరూపించలేకపోయారని ఎద్దేవా చేశారు. కాబట్టి ఇప్పుడు ఎలాన్‌మస్క్‌ను ఎన్నికల సంఘం భారత్‌కు ఆహ్వానించి హ్యాకింగ్ నిరూపణకు అవకాశమివ్వాలని కోరారు.

# దేశంలో ఈవీఎంలను నిషేధించాలి

### సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ

హైదరాబాద్, జూన్ 17 (నమస్తే తెలంగాణ): దేశంలో ఈవీఎంలను నిషేధించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్ చేశారు. జపాన్, అమెరికాలో ఈవీఎంలను బ్యాన్ చేశారని, చాలా దేశాల్లో బ్యాలెట్ ద్వారానే ఎన్నికలు జరుగుతాయని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల వరకు దేశంలో ఈవీఎంలు బ్యాన్ చేసే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు.

# తూర్పు కనుమల్లో విస్తారంగా క్యాట్‌ఫిష్

- **మత్స్యసంపదకు జలావరణానికి హాని**
- **సీసీఎంబీ పరిశోధకుల వెల్లడి**

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 17 (నమస్తే తెలంగాణ): మత్స్య సంపదకు నష్టం చేసే ప్రమాదకరమైన క్యాట్‌ఫిష్ తూర్పు కనుమల్లోని జల వనరుల్లో గణనీయంగా ఉన్నట్టు సీసీఎంబీ (సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యూలర్ బయాలజీ) పరిశోధకులు వెల్లడించారు. ఒడిశా తీర ప్రాంతం నుంచి కర్ణాటక వరకు విస్తరించిన తూర్పు కనుమల్లోని జలాల్లో 60 శాతానికి పైగా క్యాట్‌ఫిష్ ఉన్నట్టు పేర్కొన్నారు. ఇవి తమ మనుగడ కోసం పెంపుడు చేపలపై దాడి చేయడంతోపాటు జాలర్లు ఏర్పాటు చేసుకున్న వలలను ధ్వంసం చేస్తాయని, జలావరణానికి విఘాతం కలిగిస్తాయని తెలిపారు. నీటిలో ఉండే జీవ వ్యర్థాల ఆధారంగా నమూనాలు సేకరించి క్యాట్‌ఫిష్ సంతతి పెరుగుదలపై పరిశోధకులు అధ్యయనం చేశారు. నీటిలో వేగంగా పెరిగే ఆల్గేను నియంత్రించేందుకు పెంచిన సెయిల్‌ఫిన్ క్యాట్‌ఫిష్ జాతి చేపలు క్రమంగా వాటిని సంతతిని పెంచుకుంటున్నాయి. ఇవి సాధారణ మత్స్య సంపదపై అధిపత్యం చెలాయించేలా వృద్ధి చెందుతున్నాయి. భారీగా పెరిగిన క్యాట్‌ఫిష్‌లతో జలావరణం దెబ్బతినే ప్రమాదం ఉందని, దీంతో మత్స్య సంపదకు భారీ నష్టాలు వస్తాయని పరిశోధకులు హెచ్చరించారు.

# ఎన్సీఈఆర్టీపై చట్టపరమైన చర్యలు!

**ప్రముఖ విద్యావేత్తలు యోగేంద్ర యాదవ్, సుహాస్ హెచ్చరిక**

న్యూఢిల్లీ : జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్సీఈఆర్టీ)ని ప్రముఖ విద్యావేత్తలు యోగేంద్ర యాదవ్, సుహాస్ పల్సికర్ సోమవారం హెచ్చరించారు. టెక్స్ట్‌బుక్స్‌లో తాజా సవరణల పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్సీఈఆర్టీ డైరెక్టర్ దినేష్ ప్రసాద్ సక్లానీకి రాసిన లేఖలో, టెక్స్ట్‌బుక్స్‌ను వక్రీకరించే నైతిక, చట్టబద్ధ హక్కు ఎన్సీఈఆర్టీకి లేదన్నారు. సవరించిన పాఠ్య పుస్తకాల్లో కూడా తమను ప్రధాన సలహాదారులుగా పేర్కొనడాన్ని తప్పుబట్టారు. ఎన్సీఈఆర్టీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న టెక్స్ట్‌బుక్స్ సాఫ్ట్‌కాపీస్‌లో తమ పేర్లను తొలగించాలని గత ఏడాదిలోనే తాము కోరామని గుర్తు చేశారు. తమ పేర్లను తొలగించకుండా, 6 కొత్త వెర్షన్స్ టెక్స్ట్‌బుక్స్‌ను విడుదల చేయడం దిగ్భ్రాంతికరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ అనుమతి లేకుండా తమ పేర్లను రాసినందుకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# అగ్నిమాపకశాఖకు 190.14 కోట్లు

- **తెలంగాణకు 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు**
- **నిధులతో ఫైర్ రోబోలు, భవనాలు, వాహనాలు**
- **శాఖ బలోపేతానికి నాడు కేసీఆర్ సర్కారు కృషి**
- **4 ఏండ్లుగా ఫైనాన్స్ కమిషన్‌కు ఫైర్ డీజీ లేఖలు**
- **పదేండ్లలో 100 కోట్ల వరకు బడ్జెట్ కేటాయింపు**
- **అన్ని జిల్లాలకు అగ్నిమాపక కేంద్రాల ఏర్పాటు**

హైదరాబాద్, జూన్ 17 (నమస్తే తెలంగాణ): తెలంగాణ అగ్నిమాపకశాఖ మరింత బలోపేతం కానున్నది. 15వ ఫైనాన్స్ కమిషన్ నుంచి రాష్ట్ర అగ్నిమాపశాఖకు రూ.190.14 కోట్లు (రాష్ట్ర వాటా రూ.47.53 కోట్లు) రానున్నాయి. ఇటీవల ఢిల్లీలో 15వ ఫైనాన్స్ కమిషన్ నిధుల కోసం దేశంలోనే తొలిసారిగా ఎంవోయూ కుదుర్చుకున్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. ఈ నిధుల విడుదలకు ఫైర్ డీజీ వై నాగిరెడ్డి తీవ్రంగా కృషి చేశారు. కేంద్రం నుంచి వచ్చే నిధులతో రూ.85.57 కోట్లతో వాహనాలు, యంత్రసామగ్రిని కొనుగోలు చేయనున్నారు. వీటిల్లో 104 మీటర్ల ఎత్తులో కూడా మంటలను ఆర్పగలిగే హైడ్రాలిక్ వాహనం, 32 మీటర్ల ఎత్తులో మంటలను అదుపుచేసే హైడ్రాలిక్ వాహనాలు, 68 మీటర్ల ఎత్తులో మంటల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు ఉపయోగించే నిచ్చెనలు, 4 ఫైర్ ఫైటింగ్ రోబోలు, రెస్క్యూ బోట్లు, క్విక్ రెస్పాన్స్ వాహనాలు, హై ప్రెజర్‌పంప్స్ వంటివి ఉన్నాయి. అర్బన్ స్టేషన్లలో అప్‌గ్రేడేషన్, కంట్రోల్ సెంటర్, జీపీఎస్, వైర్‌లెస్ సాంకేతిక వ్యవస్థల కోసం రూ.9.50 కోట్లను ఖర్చు చేయనున్నారు. వీటితోపాటు ట్రైనింగ్ సెంటర్ సామర్థ్యాన్ని పెంచేందుకు, శిక్షణ పొందేవారి మెరుగైన వసతుల కల్పనకు, సాంకేతికతతో కూడిన శిక్షణ ఇచ్చేందుకు రూ.9.51 కోట్లను వెచ్చించనున్నారు. రాష్ట్ర అగ్నిమాపశాఖ ప్రత్యేక వినతులు, ఆన్‌గోయింగ్ ప్రాజెక్టుల ఖర్చులకు రూ.28.52 కోట్లను కేటాయించారు.

**18 కొత్త అగ్నిమాపక కేంద్రాల నిర్మాణం**

కేంద్రం ఇచ్చే తాజా నిధులతో రాష్ట్రవ్యాప్తంగా 18 చోట్ల అగ్నిమాపక కేంద్రాలను నిర్మించనున్నారు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లా పునర్విభజన అనంతరం 2017లో కొత్తగా 18 ఫైర్‌స్టేషన్లను మంజూరు చేసింది. వాటి నిర్మాణానికి సరిపడా నిధులు లేకపోవడంతో తాత్కాలిక భవనాల్లోనే వాటిని కొనసాగిస్తున్నారు. నాటినుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ఒత్తిడి ఫలితంగా ప్రస్తుతం నిధుల విడుదలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో మేడ్చల్ మల్కాజిగిరి, చంద్రాయణగుట్ట, ఎల్బీనగర్, జూబ్లీహిల్స్, అంబర్‌పేట్, రాజేంద్రనగర్, షాద్‌నగర్, అలంపూర్, మక్తల్, స్టేషన్‌ఘన్‌పూర్, నర్సాపూర్, హుస్నాబాద్, డోర్నకల్, కల్వకుర్తి, పినపాక, బాల్కొండ, ధర్మపురి, నందిపేటలో కొత్తగా ఫైర్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టనున్నారు. వీటికి రూ.57.04 కోట్లను ఖర్చు చేయనున్నారు. ఇప్పటికే శిథిలావస్థలో ఉన్న చెన్నూర్, నిజామాబాద్‌రూరల్, పాలకుర్తి, జయశంకర్ భూపాలపల్లి, వైరా, దేవరకద్ర, కొడంగల్, ఆలేరు, ఖానాపూర్, మోత్కూర్, జడ్చర్లలో అగ్నిమాపకశాఖ భవనాలను పునర్నించనున్నారు. ఖమ్మం, ఆదిలాబాద్ ఫైర్ హెడ్‌క్వార్టర్స్, కంట్రోల్ రూమ్‌లను అప్‌గ్రేడ్ చేయనున్నారు. చేవెళ్ల ఫైర్‌స్టేషన్ పెండింగ్ పనులను పూర్తి చేయనున్నారు. ఈ మొత్తం నిర్మాణాలకు సుమారు రూ.28.52 కోట్లను ఖర్చు చేయనున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అగ్నిమాపకశాఖకు ఏటా బడ్జెట్‌లో రూ.1-3 కోట్లలోపే కేటాయించేవారు. తెలంగాణ ఏర్పడ్డాక కేసీఆర్ ప్రభుత్వం అగ్నిమాపకశాఖ ఔన్నత్యాన్ని, అవసరాన్ని గుర్తించింది. పదేండ్లలో రూ.100 కోట్ల వరకు కేటాయించింది. ఫలితంగా 2023 ముగింపునాటికి 9.67 శాతం అగ్ని ప్రమాదాలు తగ్గాయి. ఒక్క ఏడాదిలోనే 2,093 మంది ప్రాణాలను రక్షించారు. రూ.918 కోట్ల ఆస్తిని అగ్నిమాపకశాఖ కాపాడింది. నాటి సీఎం కేసీఆర్.. కొత్తగా 50 మంది సిబ్బందితో ఎస్టీఆర్ఎఫ్ ఏర్పాటు చేయించి.. అగ్నిమాపకశాఖను పటిష్టమైన రక్షణ వ్యవస్థగా తీర్చిదిద్దారు.

## ఏపీ అసెంబ్లీ స్పీకర్‌గా అయన్నపాత్రుడు!

హైదరాబాద్, జూన్ 17 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడు నియమితులుకానున్నారు. ఆయన అభ్యర్థిత్వాన్ని సీఎం చంద్రబాబు ఖరారు చేసినట్టు సమాచారం. జనసేనకు డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వనున్నారు. చీఫ్ విప్‌గా టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌ను నియమించనున్నట్టు తెలిసింది.

## నేడు ఆర్జిత సేవా టికెట్ల కోటా విడుదల

హైదరాబాద్, జూన్ 17 (నమస్తే తెలంగాణ): సెప్టెంబర్ నెలకు సంబంధించి శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల కోటాను మంగళవారం విడుదల చేయనున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం జూన్ 18న ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో కోటాను విడుదల చేయనుంది. తిరుమల శ్రీవారి కళ్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్లను జూన్ 21వ తేదీన విడుదల చేస్తారు.

## పోక్సో కేసులో యెడియూరప్పను ప్రశ్నించిన సీఐడీ

బెంగళూరు: కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నేత బీఎస్ యెడియూరప్పను సీఐడీ సోమవారం మూడు గంటలపాటు ప్రశ్నించింది. 17 ఏళ్ల మైనర్ బాలిక తల్లి చేసిన ఫిర్యాదు మేరకు ఆయనపై పోక్సో, ఇతర సెక్షన్ల ప్రకారం కేసు నమోదైంది. సీఐడీ అధికారి ఒకరు మాట్లాడుతూ, ఫిబ్రవరి 2న బాధితురాలిని యెడియూరప్ప తన నివాసంలో లైంగికంగా వేధించినట్లు ఆరోపణలు నమోదయ్యాయని చెప్పారు. మార్చి 14న నమోదైన ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఆయనకు సమన్లు జారీ చేశారు. అయితే ఈ ఆరోపణలను ఆయన తిరస్కరించారు. తనపై కుట్రలకు పాల్పడేవారికి ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. ఆయనను అరెస్టు చేయరాదని కర్ణాటక హైకోర్టు శుక్రవారం చెప్పింది. ఇదిలావుండగా, బాధిత బాలిక తల్లి అనారోగ్యంతో గత నెలలో మృతి చెందారు.

# లింక్డిన్‌లో కొత్త ఏఐ టూల్



న్యూఢిల్లీ, జూన్ 17: ఉద్యోగ అన్వేషణలో ఉపయోగపడేలా లింక్డిన్ కొత్త ఏఐ టూల్స్‌ను తీసుకొచ్చింది. యూజర్లకు తోడ్పడేలా, ప్రక్రియను మరింత సులభతరం చేసేలా ఏఐ సాధనాల్ని 'లింక్డిన్' రూపొందించింది. ఉద్యోగానికి ఎంపికయ్యేలా రెజ్యూమ్, దరఖాస్తులోని ఏయే స్కిల్స్‌ను హైలైట్ చేయాలో తెలియజేస్తుంది. లింక్డిన్‌లో కావాల్సిన జాబ్ పోస్టింగ్స్‌ను వెతకటం కోసం ఇప్పటివరకు వివిధ రకాల ఫిల్టర్స్‌ను ఉపయోగించాల్సి వచ్చింది. ఇకపై ఆ అవసరం లేకుండా ఏఐ టూల్స్ యూజర్ల పనిని సులభతరం చేయనున్నాయి. అయితే ఈ కొత్త ఫీచర్స్ ప్రీమియం సబ్‌స్క్రైబర్లు మాత్రమే పొందనున్నారు.

# పాక్ కంటే భారత్ వద్దే ఎక్కువ అణ్వాస్త్రాలు

న్యూఢిల్లీ, జూన్ 17: అణ్వాయుధాల్ని పెంచుకోవటంలో భారత్, చైనా, పాకిస్థాన్ దేశాలు ఒకదానికొకటి పోటీ పడుతున్నాయి. పాకిస్థాన్-170, భారత్-172 అణ్వాయుధాల్ని కలిగివున్నాయని, క్రితం ఏడాదితో పోల్చితే 2024 జనవరి నాటికి చైనా అణు వార్‌హెడ్స్ 410 నుంచి 500కు పెరిగాయని స్వీడన్‌కు చెందిన మేధో సంస్థ 'సిప్రి' (స్టాక్‌హోం ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) తాజా నివేదిక పేర్కొన్నది. 'అణ్వాయుధ సేకరణలో భారత్‌ను నిరోధించటమే లక్ష్యంగా పాకిస్థాన్ ప్రణాళికలు ఉన్నాయి. సుదీర్ఘ లక్ష్యాల్ని తాకే అణువార్ హెడ్లపై భారత్ దృష్టిపెట్టింది. ముఖ్యంగా చైనా అంతటా లక్ష్యాల్ని చేరుకోగలగటం ప్రాధాన్యతగా ఉంది' అని నివేదిక తెలిపింది. భారత్, పాక్, చైనా, అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, ఉత్తర కొరియా, ఇజ్రాయెల్ దేశాల అణు వార్‌హెడ్లకు సంబంధించి కీలక విషయాల్ని నివేదికలో పేర్కొన్నది. దీని ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా మొత్తం 2,100 అణ్వాయుధాలు ఉన్నాయి. దీంట్లో 90 శాతం అమెరికా, రష్యా కలిగి ఉన్నాయి.

## *కుక్క దాడితో 42 రోజుల పసికందు మృతి*

**మహబూబాబాద్ జిల్లాలో ఘటన**

*తొర్రూరు, జూన్ 17 : కుక్క దాడిలో 42 రోజుల శిశువు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం మడిపల్లిలో సోమవారం చోటుచేసుకున్నది. మడిపల్లికి చెందిన రేణుకకు నెల్లికుదురు మండలం చెట్ల ముప్పారం గ్రామానికి చెందిన దర్శనం వెంకన్నతో వివాహమైంది. ప్రసవం కోసం రేణుక తల్లిగారింటికి రాగా 42 రోజుల క్రితం మగ శిశువుకు జన్మనిచ్చింది. సోమవారం ఉదయం 8 గంటలకు రేణుక, ఆమె తల్లి వెంకటమ్మ బయట పనుల్లో ఉన్న సమయంలో ఓ కుక్క ఇంట్లోకి చొరబడింది. మంచంలో నిద్రిస్తున్న శిశువును తలపై తీవ్రంగా గాయపర్చింది. ఆ పసికందు ఏడుపు శబ్దం విని వారిద్దరు ఇంట్లోకి వెళ్లి చూడగా తీవ్రగాయాలతో కనిపించాడు. వెంటనే తొర్రూరులోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో 108 అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ కన్నుమూశాడు. శిశువు మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు. అల్లారుముద్దుగా చూసుకుంటున్న క్రమంలో కుక్క వచ్చి బలితీసుకోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.*

## మదనపల్లెలో టమాటా కిలో రూ.80

హైదరాబాద్, జూన్ 17 (నమస్తే తెలంగాణ): టమాటా మార్కెట్‌కు పేరుగాంచిన ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లెలోనూ ధర భగ్గుమంటున్నది. సోమవారం మదనపల్లె వ్యవసాయ మార్కెట్‌లో కిలో టమాటా ధర దదాదారూ.80 పలికింది. వర్షాల కారణంగా టమాటా దిగుబడి తగ్గడం, బక్రీద్ రోజు మార్కెట్‌కు తక్కువ సరుకు రావడం ధర పెరుగుదలకు కారణమైంది.

## ఆయుధాలివ్వాలని అటవీ సిబ్బంది వినతి

హైదరాబాద్, జూన్ 17 (నమస్తే తెలంగాణ): అటవీ సిబ్బందిపై దాడులు జరుగుతున్నాయని, వీటిని అడ్డుకోవడానికి ఆయుధాలు ఇవ్వాలని, పోలీసుస్టేషన్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం స్పందించడం లేదని ఓ అధికారి తెలిపారు. తాము పంపిన ప్రతిపాదనలను అమలు చేయాలంటే రూ.61 కోట్లు ఖర్చు అవుతాయని వెల్లడించారు. అటవీ శాఖ మంత్రి సురేఖ దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లామని తెలిపారు.